# ఊహాగానం X

రచన :
"చిత్రభాను"

"నా హృదయ భానూ!

నేను ఏకవచన ప్రయోగం చేయడం మిమ్మల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తోందా? అవును మరి! ఇన్నాళ్ళూ 'తమరూ, మీరూ' అని గౌరవంగా దూరంగా పిలిచాను. కాని ఈవేళ మీ లేఖ చదివిన తర్వాత నా హృదయం ప్రేమానురాగాలతో నిండిపోయింది. ఇకనుండి జీవితమంతా మిమ్మల్ని 'నీవు నీవు' అని నాకు దగ్గరగా తీసుకొంటాను. ఆత్మీయులుగా ఏమీ అనుకోరు కదూ!

మొన్న పండగ రెండు రోజులు జ్వరంతో బాధపడ్డాను. కేవలంగా బాహ్య బాధయితే సరిపెట్టుకొనే దాన్ని. కాని మానసికంగా అంతకు రెండింతల వ్యధను అనుభవించాను. ఒకరడిగితే చెప్పగలిగే టటువంటిది కాదది. చెప్పలేను.

నా అందాల భానూ!

నీ కోసం ఎన్ని సంబోధనలను సెలక్ట్ చేసి వుంచాను. మీకింకా వివాహం కాలేదన్నారు. యువకవులా? ఒకవేళ అవతలి వారు వృద్ధులైయుండి నేను 'యువకవులనుకొన్నాను' అని రాస్తే వాళ్ళేమనుకొంటారు? ప్రేమోదానికిపోయి ప్రమాదం కొని తెచ్చుకొన్నట్లుంటుంది. మీ యువధోరణి తెలుస్తూ వున్నా అరవై ఏళ్ళు వుంటాయేమోనని ఒక్కినే రాశాను.

ఓ సంఘ సంస్కర్తా!

International marriage చేసుకొంటానన్నావు. నాకు అమెరికాలో తెలిసినవారున్నారు. బ్రహ్మాండమైన ఫోజులో ఒక ఫోటో నాకు పంపించు. వాళ్ళకు పంపిస్తాను.

భానూ!

నీ విషయాలన్ని రాయి.

లోకాన్ని పరికిస్తున్న కొద్దీ, కొన్ని సత్యాలు బయల్పడుతున్నాయి. ఈ రోజుల్లో ఈ జగన్నాటకంలో అబద్ధానికి వున్న విలువ సత్యానికిలేదు. ఇది మానవ స్వభావంలోనే వుందా? లేక కాలం మార్పా? కాలం అంటే సూర్యోదయం సూర్యాస్తమయం అమావాస్య పౌర్ణమి-ఇవి ఆదినుండి ఒకేరీతిగా వున్నాయి. మారేది మనిషి మాత్రమే! ఇతనెందుకిలా మారుతున్నాడు?

నా చిలిపి భానూ!

చాలా చిత్రంగా ఉత్తరాలు రాస్తుంటావు. నీ ఉత్తరానికి పదినిముషాలు ఆలస్యంగా జవాబిస్తున్నందుకు క్షమించు. కోపగించుకోకేం! ప్రచండ భానుడిలా నీవు మండిపడితే నీ తీక్షణ కాంతులకు నేను వాడి మాడి పోవలసినదేనా?

'నీవు నీలి ఆకాశానివి. నీ భాను కిరణాలు నీపై సోకితే వింత వింత రంగులలో ఇంద్రధనస్సులా అగుపిస్తావు నీవు.' – అని ఒకసారి రాశావు కదూ! నీవు రాసే ప్రతి అక్షరం నాకు జ్ఞాపకం వుంటుంది.

'మనం నిర్మించబోతున్న విద్యానంద మందిరానికి ప్రతి వుత్తరం ఒక బంగారు

సోపానమే' అని అన్నావు. ఎంత చక్కగా గొప్పగా అన్నావు.

నిజమైన స్నేహం స్త్రీకి స్త్రీకి, పురుషుడికి పురుషుడికి కలగదు. స్త్రీకి పురుషుడికి కలుగుతుందని ఎక్కడో చదివాను. ఆ పురుషుడివి నీవే అయితే జీవితంలో ఎంత ఆనందాన్ని పొందుతాను!

జీవితంలో అనేకమంది స్నేహితులు వస్తూ పోతూ వుంటారు. కాని ఎవరో ఒక్కరే హృదయ పీఠంపై ఆసీనులవ్వడాని అర్హులౌతారు. ఆ హక్కు నీకు తప్ప ఇంకెవరికున్నది?

అందాన్ని ఆస్వాదించే భానూ!

ఎప్పుడూ వెన్నెలలో కూర్చొనే ఉత్తరం రాయమంటావు. మనిద్దరికోసం పౌర్ణమి చంద్రుడు క్షీణించి పోకుండా వుంటే బావుండును. వసంతకాల శీతల సమీరం నా శరీరాన్ని తాకి గిలిగింతలు పెడుతోంది. పందిరి మంచంమీద కిటికీ ప్రక్కగా కూర్చొని నా భానుకు ఏం వ్రాయాలా అని ఆలోచిస్తున్నాను. ఒకప్రక్క పక్షుల కిలకిలారావాలు! మరో ప్రక్క కీచురాళ్ళ చప్పుడులు! నవ్వు వస్తోందా భానూ నా పాత కాపీ కవిత్వానికి?

అతీతమైన ఆదర్శాలతో ముందుకు సాగిపోవాలి మనం. మన జీవితాలలో ఏ ఒక్కరికైనా కనీసం ఆనకదంరమైన ఘటనలు సంభవిస్తే ఇద్దరం ఒకటై మందహాసాలతో ఈ ధరణిని నింపేయాలి. విషాదాలే ఎదురైతే సానుభూతితో కన్నీటి స్రవంతులను ప్రవహింపచేయడానికి కూడా వెనుకంజ వేయరాదు. మనిద్దరి కన్నీటి భాష్పాలు ఏకమయ్యేరోజు ఎప్పుడు వస్తుందో?' అని రాశావు. నీవు ఏమన్నా అది నాకు ఆజ్ఞ అవుతుంది.

మనిద్దరం ఈ ప్రపంచలోని ఆనందాన్ని అనుభవించాలి. నీకు పాటలు పాడడం వచ్చు కదూ! మనిద్దరం కలుసుకొన్నప్పుడు ఒక్కపాటైనా పాడాలి నీవు.

'ఒకరి దగ్గరున్నలోట్లు మరొకరు చెప్తే కాని అవి భర్తీ కావు. మన భావాలు మరో పథకంవైపు పరుగిడవచ్చు. ఆ దారి తప్పుదారయితే మనం వెంటనే తప్పకుండా తప్పుకోవాలి!' అని అన్నావు. ఏం భానూ! అలా రాశావు. నేనేం తప్పుదారి త్రొక్కానా? చెప్పవూ? చెప్పి నీవైపు త్రిప్పుకోవూ?

ఊహాలోకంలోని భానూ!

నీ పెద్ద ఉత్తరం ఇప్పుడే అందింది. ఎంత పొంగిపోయాను నేను!-అది చదివిన తర్వాత. ఒక్కొక్కసారి నీవు కోపంగా రాస్తుంటావు. నాకు చాలా భయమేస్తుంటుంది. నీకింత కోపంవస్తే నే నెలా భరించేది? నీ చల్లని పన్నీటి జల్లులతో నా హృదయంలో ప్రజ్వరిల్లుతున్న దావాగ్నిని చల్లార్చి శాంతిని ప్రసాదించు.

నీ అక్షరాలలోనున్న అయస్కాంత తత్వం నా అక్షరాలకు వుండదు. నీ మధుర భావాలతో నా హృదయన్ని స్పందింపజేస్తున్నావు. ఆ మృదు మధుర స్పందన ప్రతిఫలాలే ఈ ఉత్తరాలు!

నా ముద్దుల భానూ!

అక్షరాల ముత్యాలను కవరులో పంపించావు. నీకు నే నెలా జవాబు లివ్వడమో తెలీకుండా వుందినాకు. నా హృదయ ప్రాంగణంలో నీవు తొలిసారిగా అడుగు పెట్టిన రోజే అనుకొన్నాను, భాను నావాడని. నేనే తప్పులులు చేసినా భాను క్షమిస్తాడు.

'మనం ఈ ప్రపంచంలో ఎవరికీ అర్థం కాకూడదు. నేనులేనిది నీవు లేవు. నీవు లేనిది నేను లేను. ఒకరికొకరం ఎప్పుడూ దూరంగానే వుంటాము. నీ వెంత అందంగా మాట్లాడతావో నేను వినలేదు. వినకపోవడమే మంచిది. అందులోనే ఆనందం వుంది. వినకపోయినా నీ మధుర శబ్దాలు నా కర్ణాలలో కాపురం చేస్తుంటాయి. నా కళ్ళముందు ఎప్పుడూ నర్తిస్తూనే యుంటావు నీవు.' ఏమిటి భానూ! ఇలారాస్తున్నావు.

శశికాంత పెరిగి పెరిగి యౌవన ప్రాంగణంలో అడుగు పెడుతోందా? ఆమె వెదజల్లే కాంతుల్ని వేస్టుచెయ్యక వెన్నెలలోనే జవాబులు రాయమంటావా? అలాగే రాస్తానులే! నీకు వ్రాయక ఇంకెవరికి వ్రాయను ఈ ప్రపంచంలో.

సెలవు.

నీ....''

★

# రచయితలకు విజ్ఞాపన

♦

'కథాంజలి' అవాంతరాల నధిగమిస్తూ - యిరవయి అయిదేండ్లపాటు ఆంధ్రపాఠక లోకాన్ని ఆనందపరిచి - రజతోత్సవం కూడా చేసుకుంది.

మరల 10-11-63 నాటికి దీపావళి సంచికను సర్వాంగ శోభితంగా రూపులు దిద్దుకొని మీ ఎదుట స్సాక్షాత్కరిస్తుంది.

ఈ సంచికకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక విషయాలమీద భావగర్భితమైన, క్లుప్తంగా ఉన్న రచనలను పంపాలని రచయితలకు విజ్ఞప్తిచేస్తున్నాం.

తెలుగుదేశపు ఆచార వ్యవహారాలమీద, సంప్రదాయాలమీద వెలుగును ప్రసరించే కథలు, కథానికలు మాకు విరివిగా కావాలి. ప్రోత్సాహకల రచనలను కూడా మేము సాధ్యమైనంతవరకు మా పత్రికలో ప్రచురించాలని నిర్ణయించుకొన్నాం.

మా పత్రిక సినిమా, నాటక కళలకు కూడా ప్రాధాన్యం యిస్తుంది. అందుచేత యీ కళల మీద కూడా మాకు రచవలను పంపాలని మేము కోరుతున్నాం. కవికుమారులు తమ కలాలకు పదును పెట్టి చక్కని జాతీయ ప్రబోధ గీతాలను కూడా వ్రాసి మాకు పంపవచ్చును. ఇరవై అయిదేండ్లనుంచి అవిఘ్నంగా నడుస్తున్న యీ పత్రిక తమదనుకొని రచయితలు తమ అమూల్యమయిన రచనలను 5-10-63 వ తేదిలోపల పంపించాలని కోరుతున్నాం.

—సంపాదకుడు.